సమావేశంలో మాట్లాడుతున్న చుక్క రాములు

కనీస వేతనం పెంపుదలే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్త ఉద్యమం

- కిర్బీ కార్మికుల సమావేశంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కనీస వేతనం పెంపుదలే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడుతున్నట్టు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు, కిర్బీ యూనియన్ అధ్య క్షులు చుక్క రాములు అన్నారు. కొత్తగా పర్మినెంట్ అయిన కిర్బీ కార్మికుల సమావేశాన్ని సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణంలోని శ్రామిక్‌భవన్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కనీస వేతనాలు పెంచలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా కనీస వేతనాలు పెంచకుండా మీనమేషాలు లెక్కిస్తోందని విమర్శించారు. గత 15 ఏళ్ల నుంచి కనీస వేతనాలు పెరగకపోవడం వల్ల కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పెట్టుబడుదారులకు అనుకూలంగా మాత్రమే పాలకుల నిర్ణయాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కనీస వేతనం పెంచాలంటూ ఈ నెలలో పెద్ద ఎత్తున ఆందోళన చేయబోతున్నామని తెలిపారు. ఈ ఆందోళనల్లో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె రాజయ్య, జనరల్ సెక్రెటరీ విఎస్ రాజు, నాయకులు శ్రీనివాస్, నాగ ప్రసాద్, మహేశ్వర్ రెడ్డి, ఏడుకొండలు, లక్ష్మణ్, రాములు, లఖాన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదల స్థలాల జోలికొస్తే సహించం

- ఇళ్ల స్థలాల బై బ్యాక్‌కు వ్యతిరేకంగా కలెక్టరేట్ ముట్టడి
- ఉద్రిక్తం, తోపులాట
- కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు యత్నించిన బాధితులు
- పోలీసులకు, సిపిఎం కార్యకర్తలకు వాగ్వివాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలోని శివాయిగూడెం కొత్త కాలనీ సమస్యలు పరిష్కరించాలని, 900 మంది పేదలకు ఇచ్చిన ఇండ్ల స్థలాల బై బ్యాక్‌కు వ్యతిరేకంగా సిపిఎం ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. ధర్నా చౌక్ నుంచి ప్రదర్శనగా బయలుదేరిన ఇండ్ల స్థలాల బాధితులను పోలీసులు అడ్డుకోవడంతో ఆందోళన ఉద్రిక్తమైంది. ముట్టడికి వచ్చిన సిపిఎం శ్రేణులు, ప్రజలు కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద నుంచి లోపలికి చొచ్చుకెళ్లేందుకు యత్నించారు. ఈ సందర్భంగా పోలీసులు, కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. ఇండ్ల స్థలాలను గుంజుకోవద్దంటూ నినాదాలు చేశారు. ఈ ఆందోళనలో సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రఘునాథపాలెం మండలంలోని ఈ కాలనీలో పేదల ఇండ్ల స్థలాల బై బ్యాక్ ప్రక్రియను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. లేకపోతే ప్రజా ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా లబ్ధిదారులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకపోగా ఇచ్చిన స్థలాలను గుంజుకునే ప్రయత్నం చేయడం సరైంది కాదన్నారు. జిల్లా మంత్రులు, కలెక్టర్ జోక్యం చేసుకొని పేదలు ఇల్లు నిర్మించుకునేందుకు ఆటంకాలు కల్పించవద్దని కోరారు. సిపిఎం అనేక దఫాలుగా నిర్వహించిన పోరాటాల ఫలితంగానే గతంలో ఖమ్మం నగరంలోని పేదలకు రఘునాథపాలెం మండలంలోని శివాయిగూడెం రెవెన్యూలో ఇండ్ల స్థలాలు మంజూరు చేశారని అన్నారు. 15 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ సరైన వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నగరానికి అతి సమీపాన ఉన్న రఘునాథపాలెం మండలంలో పేదలకు కరెంటు లేకుండా నీటి సౌకర్యం లేకుండా జీవిస్తున్నారని తెలిపారు. వెంటనే కాలనీలో మిషన్ భగీరథ పథకం కింద ప్రతి ఇంటికి మంచినీటి సౌకర్యాన్ని కల్పించాలని, పైపులైన్లు వేయాలని డిమాండ్ చేశారు. పట్టాలు ఇచ్చిన ప్రతి ఒక్కరికి ఇంటి నిర్మాణం కోసం రూ.ఐదు లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్ర శ్రీకాంత్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్ర శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.నవీన్ రెడ్డి, ఎంఎ జబ్బార్, షేక్ మీరా సాహెబ్, మండల కార్యదర్శి భూక్య శ్రీనివాస్, షేక్ నాగుల్ మీరా, డివిజన్ నాయకులు షేక్ సైదులు, యర్రా రంజిత్, గుగులోత్ కుమార్, కూరపాటి శ్రీనివాస్, ప్రజా సంఘాల జిల్లా నాయకులు చింతల రమేష్ పాల్గొన్నారు.

బెంగాల్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బెంగాల్ విద్యాశాఖ మంత్రిని బర్తరఫ్ చేయాలి

- బిజెపి, టిఎంసి మైత్రితో ప్రజాస్వామ్య హక్కులపై దాడులు : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పశ్చిమ బెంగాల్ విద్యాశాఖ మంత్రిని వెంటనే బర్తరఫ్ చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. కలకత్తా నగరంలో జాదవ్‌పూర్ యూనివర్శిటీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థి సంఘానికి ఎన్నికలు నిర్వహించి, విద్యార్థుల హక్కులను కాపాడాలని నిరసన తెలిపారని చెప్పారు. ఈ క్రమంలో ఈ నెల 1న యూనివర్సిటీలో పర్యటించిన బెంగాల్ విద్యాశాఖ మంత్రి బ్రాత్య బసుకు నిరసన తెలపగా.. అలాగే కాన్వాయ్‌ను ముందుకు పోనిచ్చారని, దాంతో పలువురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు నిరసనగా ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఈసీఐఎల్ కేంద్రంలో నిరసన తెలిపి, బెంగాల్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా టి.నాగరాజు మాట్లాడుతూ.. గతంలో రైతు ఆందోళన కార్యక్రమాల్లో లఖింపూర్ ఖేరీలో రైతులపైకి బిజెపి నేత కాన్వాయ్ ముందుకు కదిలించి ఎలాగైతే ప్రాణం తీశారో.. అదే తరహాలో బెంగాల్ విద్యాశాఖ మంత్రి జాదవ్‌పూర్ యూనివర్సిటీలో విద్యార్థులపైకి కాన్వాయ్‌ని ముందుకు కదిలించి తీవ్ర గాయాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగాల్ టీఎంసీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తోందని, విద్యార్థి సంఘాల ఎన్నికలు రద్దు చేయాలని కుట్రతో వ్యవహరిస్తోందని అన్నారు. సమస్యలను పరిష్కరించకుండా, విద్యార్థుల సమస్యల గురించి మాట్లాడానికి ప్రతినిధులను ఎన్నుకునే హక్కులు లేకుండా చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలసి ఆందోళనలు చేస్తుంటే అణచివేయడానికి పూనుకున్నదన్నారు. పోలీసు, పారా మిలటరీని ఉపయోగించి విద్యార్థులపై కేసులు నమోదు చేసి క్యాంపస్‌లో భయానక పరిస్థితులను సృష్టిస్తున్నదని చెప్పారు. తక్షణమే ఈ ఘటనపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించాలని, విద్యాశాఖ మంత్రి బ్రాత బసును బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి హక్కులను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్, జిల్లా అధ్యక్షులు అవినాష్, ఉపాధ్యక్షులు మనోజ్, అరుణ్, భగత్, సతహాయ కార్యదర్శులు శ్యామ్, సుబ్బు, జిల్లా కమిటీ సభ్యులు అనిల్, శివ, నందీశ్వర్, శ్రీమాన్, ప్రణయ్ పాల్గొన్నారు.

సంక్షేమం, సబ్సిడీల్లో కోత

- కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం
- ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వకపోవడం అన్యాయం
- బిజెపి ఎంపిలు కేంద్రంపై ఒత్తిడి చేయాలి...లేదా రాజీనామా చేయాలి
- ప్రజాసమస్యల పరిష్కారానికి నెల రోజుల ఉద్యమానికి సిపిఎం పిలుపు
- ఎస్ఎల్‌బిసి ప్రమాదంపై న్యాయ విచారణ జరిపించాలి : జాన్‌వెస్లీ

విలేకర్లతో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 50 లక్షల 65 వేల కోట్ల రూపాయల బడ్జెట్‌లో తెలంగాణకు తగిన నిధులు కేటాయించకుండా సంక్షేమ పథకాలకు, సబ్సిడీలకు కోద పెట్టిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సుమంగలి పంక్షన్‌హాల్‌లో సోమవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

రాష్ట్రం నుంచి కేంద్రానికి ఆదాయం సమకూరుతున్నా, తిరిగి రాష్ట్రానికి తగినన్ని నిధులు రావడం లేదని చెప్పారు. రూపాయి ఆదాయం కేంద్రానికి పోతే.. 25 పైసలు కూడా రావడం లేదన్నారు. పాలమూరు- రంగారెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికే రాష్ట్ర ఆదాయం తగ్గుతున్న నేపథ్యంలో కేంద్రం తన వంతు నిధులను కూడా తగ్గిస్తూ.. అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకు అందించే అనేక సంక్షేమ పథకాలకు నిధులను గణనీయంగా తగ్గించిందని తెలిపారు. రైతులకు ఇచ్చే సబ్సిడీలను కుదిస్తూ, సామాన్య ప్రజలకు మేలు చేసే పథకాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ, నిధుల కోసం బిజెపి ఎంపిలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని, లేకపోతే తగిన బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను పున్ణసమీక్షించి, రాష్ట్రానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు.

6 గ్యారంటీలకు సరైన బడ్జెట్ కేటాయించాలి

రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా బడ్జెట్‌ను రూపొందించాలని, ముఖ్యంగా ఆరు హామీలకు తగిన నిధులను కేటాయించాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు ఆచరణలోకి రాకుంటే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

నెల రోజుల పాటు సిపిఎం ఉద్యమాలకు పిలుపు

స్థానిక సమస్యల పరిష్కారం కోసం నెల రోజుల పాటు సిపిఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపట్టనున్నట్టు జాన్‌వెస్లీ వెల్లడించారు. ప్రజా సమస్యలపై నిరసన కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తామని తెలిపారు.

మార్చి 8న మనువాద వ్యతిరేక ఉద్యమం

మహిళల హక్కులను రక్షించేందుకు, లింగ వివక్షను తగ్గించేందుకు ఈ ఏడాది మహిళా దినోత్సవాన్ని ప్రత్యేకంగా జరుపనున్నట్టు చెప్పారు. మార్చి 8న మనువాద వ్యతిరేకంగా కార్యాచరణ రూపొందించనున్నట్టు తెలిపారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు వర్ధంతిని మార్చి 23న ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రామాల స్థాయిలో నిర్వహించి, యువతకు వారి త్యాగాల గురించి తెలియజేయాలని సిపిఎం నిర్ణయించినట్టు వివరించారు.

ఎస్ఎల్‌బీసీ ప్రమాదంపై న్యాయ విచారణకు డిమాండ్

ఎస్ఎల్‌బీసీ ప్రమాదం పూర్తిగా ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని, దీనిపై తక్షణమే న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

వామపక్షాల ఐక్యతపై స్పందన

ప్రస్తుత పరిస్థితుల్లో వామపక్ష పార్టీల ఐక్యత అత్యవసరమని జాన్‌వెస్లీ అభిప్రాయపడ్డారు. ప్రజా సమస్యల పరిష్కారానికి స్పష్టమైన డిమాండ్లతో వామపక్షాలు ఐక్యంగా పోరాడాలని సూచించారు. భవిష్యత్‌లో వామపక్ష ఉద్యమాలను బలోపేతం చేయాలని, ప్రజాస్వామిక హక్కుల సాధన కోసం పోరాటం ముమ్మరం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మీ, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కోలిశెట్టి యాదగిరిరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగారపు పాండు, ములకలపల్లి రాములు, మట్టిపల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ జిఓను ప్రజానుకూలంగా మార్చాలి

సిఎం రేవంత్‌రెడ్డికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రెగ్యులేషన్ ఆఫ్ అన్ అప్రూవ్డ్ అండ్ ఇల్లీగల్ లేఔట్స్ రూల్స్-2020కు జిఓ నెంబర్ 28 మార్గదర్శకాలను ప్రజలకు సానుకూలంగా ఉండే విధంగా మార్చాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సోమవారం ఆయన లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తుదారులు చెల్లించాల్సిన మొత్తం ఫీజులో 25 శాతం రాయితీని ప్రకటించడంతోపాటు, కొత్తగా ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. అదే సందర్భంలో పేదలు కొనుగోలు చేసిన ప్లాట్లను ఎటువంటి ఫీజు లేకుండా రెగ్యులర్ చేయాలని కోరారు. గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జిఓ 28 ప్రకారం గతంలో గ్రామపంచాయతీలు అనుమతి ఇచ్చిన లేఅవుట్లలో చాలామంది పేద, మధ్యతరగతి ప్రజలు తమ అవసరాల కోసం 100, 200 గజాలు కొనుగోలు చేశారని వివరించారు. 70 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన ప్లాట్లకు కూడా సంబంధిత హెచ్ఎండిఎ, డిటిసిపి అనుమతి లేదంటూ ఇవి అక్రమ ప్లాట్లనీ, ఇంటి నిర్మాణాలకు, రిజిస్ట్రేషన్లకు అనుమతించబోమని, వాటిని సక్రమం చేసుకోవడానికి ఎల్ఆర్ఎస్ ద్వారా ప్రభుత్వానికి పెనాల్టీలు చెల్లించాలని ప్రభుత్వం చెప్తున్నదని పేర్కొన్నారు. లేఅవుట్ వేసిన భూ యజమానిని తప్పించి తర్వాత ప్లాటు కొనుగోలు చేసిన వ్యక్తులపై భారం వేయడం ఏ మాత్రం సమంజసం కాదని తెలిపారు. కావున ఎల్ఆర్ఎస్ 2020కి సవరణ చేస్తూ తెచ్చిన జీవోనెంబర్ 28 నిబంధన 'ఎనిమిది బి'లో పొందుపర్చిన విధంగా దరఖాస్తుదారులపై భారం పడకుండా తగిన చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల్లో ఆటోమేటిక్ ఫీజు జనరేషన్ పద్ధతిని అవలంబిస్తున్నారని తెలిపారు. క్రమబద్ధీకరిస్తే సర్టిఫికెట్ ఇస్తామనీ, ఒకవేళ తిరస్కరిస్తే చెల్లించిన డబ్బులో 10 శాతం నగదును మినహాయించుకుని మిగతా డబ్బును తిరిగి దరఖాస్తుదారుని బ్యాంకు ఖాతాలో వేస్తామని ప్రకటించిందని పేర్కొన్నారు. ప్రభుత్వ అకౌంట్లోకి డబ్బు వెళ్లాక తిరిగి రావడం చాలా అరుదు అని తెలిపారు. అందువల్ల ప్లాట్‌ల క్రమబద్ధీకరణకు అయ్యే ఫీజులో 10 శాతం రుసుం ముందుగా చెల్లించి, పరిశీలన అనంతరం మిగతా డబ్బులు ఎల్ఆర్ఎస్ పోర్టల్ ద్వారా చెల్లించేందుకు అవకాశం కల్పించాలని సూచించారు.

కేంద్ర నిధులు అడ్డుకుంటున్న కిషన్ రెడ్డి

బిఆర్ఎస్‌కు బినామీగా మారిన వైనం : మంత్రి పొన్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రం నుంచి నిధులు తేవడంలో కిసాన్ రెడ్డికి ప్రణాళిక లేదని, కేంద్రం హామీలు ఇచ్చినా, నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా.. కిషన్ రెడ్డి వల్లే రాష్ట్రానికి నిధులు రావడం లేదంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. అభివృద్ధికి రావాల్సిన అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ఎప్పటికప్పుడు విజ్ఞప్తి చేస్తున్నా రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. వరంగల్ ఎయిర్ పోర్టు తన వల్లే వచ్చిందని పక్క రాష్ట్ర కేంద్ర మంత్రితో చెప్పించుకున్న ఘనత కిషన్ రెడ్డిదన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షునిగా బండి సంజయ్‌ను తొలగించి కెసిఆర్ బినామీగా కిషన్ రెడ్డి అధ్యక్షులు అయ్యాడని ఆరోపించారు. ఇప్పుడు కూడా బిఆర్ఎస్‌కు బినామీగా ఉన్నారని అన్నారు.

కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి జరగడం కిషన్ రెడ్డికి ఇష్టం లేదన్నారు. తామేమీ కిషన్ రెడ్డిని బిచ్చం అడగడం లేదని, రాష్ట్ర అభివృద్ధికి నిధులు అడుగుతున్నామని తెలిపారు. తెలంగాణ అభివృద్ధి నిరోధకులుగా ఇక్కడి కేంద్ర మంత్రులు ఎందుకు ప్రవర్తిస్తున్నారో చెప్పాలన్నారు. కేంద్రంలో కులగణన ఆమోదింపచేసే బాధ్యత కేంద్ర మంత్రులు తీసుకోవాలని చెప్పారు. కుల గణనపై తాను స్వయంగా కెసిఆర్, కెటిఆర్, హరీశ్ రావుకు ఫారాలు పంపినా వివరాలు ఇవ్వలేదన్నారు. కుల గణనపై బిఆర్ఎస్‌కు మాట్లాడే నైతిక హక్కు ఇక లేదన్నారు. ఈ సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ బోలిశెట్టి శివయ్య, మార్కెట్ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, వైస్ చైర్మన్ బంక చందు, చిత్తారి పద్మ రవీందర్, వెన్న రాజు తదితరులు పాల్గొన్నారు.

మిర్చి క్వింటాలుకు రూ.25 వేలు మద్దతు ధర

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనుగోలు చేయాలి
- ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలి
- రైతు సంఘాల నాయకులు పోతినేని, తాతా మధు, భాగం డిమాండ్
- అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రైతుల భారీ ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పతనమైన ధరతో మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఆహార పంటల జాబితాలో మిర్చి పంట చేర్చి, మిర్చి క్వింటాకు రూ.25 వేలు మద్దతు ధర నిర్ణయించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కొనుగోలు చేయాలని, ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట రైతులు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష రైతు సంఘాల జిల్లా నాయకులు బొంతు రాంబాబు, కొండపర్తి గోవిందరావు అధ్యక్షతన జరిగిన సభలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు, బిఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడారు. దేశంలో అత్యధిక విస్తీర్ణంలో మిర్చి సాగు రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉందని తెలిపారు. నాణ్యమైన మిర్చి దిగుబడులు సాధించిన రైతులు మార్కెట్‌లో ధరలు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఖమ్మం మిర్చి మార్కెట్ సమీప జిల్లాలో రెండు లక్షల ఎకరాల విస్తీర్ణంలో మిర్చి పంట సాగవుతున్న నేపథ్యంలో ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని తెలిపారు. మిర్చి పంటను ఆహార పంటల జాబితాలో చేర్చి మిర్చి క్వింటాకు రూ 25 వేలు మద్దతు ధర నిర్ణయించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నాఫెడ్, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో మిర్చి సాగు చేస్తున్న వారిలో అధిక సంఖ్యలో కౌలు రైతులు ఉన్నారని, పెట్టుబడులు తిరిగి రాకపోవడంతో ఇప్పటికే నలుగురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, రైతుల ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మిర్చి ఎగుమతుల ద్వారా ఇప్పటి వరకు విదేశీ మారక ద్రవ్యం పొందిన కేంద్ర ప్రభుత్వం కష్టంలో ఉన్న మిర్చి రైతులను ఆదుకోకపోవడం దారుణమన్నారు. పురుగుమందులపై 18 శాతం, ఎరువులపై ఐదు శాతం జీఎస్టీ వసూలు చేస్తున్న ప్రభుత్వాలు రైతుల సమస్యలు పరిష్కారం చేయడం లేదని విమర్శించారు. ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు, రైతుల సమస్యలు పరిష్కారం కోసం రాజకీయాలకు అతీతంగా పోరాటాలు ఉధృతం చేస్తామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, బాణోతు చంద్రావతి, జిల్లా పరిషత్ మాజీ చైర్మెన్ లింగాల కమల్‌రాజు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు నున్నా నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, తాతా భాస్కరరావు, చింతనిప్పు చలపతిరావు, వాసిరెడ్డి ప్రసాద్, ఎస్కె మీరా, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొడ్డపాటి రమేష్, అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మలీదు నాగేశ్వరరావు, వివిధ రైతు సంఘాల నాయకులు, రైతులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

మృదువైన జుట్టుకోసం పారాచుట్ అడ్వాన్స్డ్ ఆయిల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మృదువైన, బలమైన జుట్టుకోసం పారాచుట్ అడ్వాన్స్డ్ ఆయిల్ మద్దతును ఇస్తుందని ఆకంపెనీ తెలిపింది. ప్రస్తుత వేసవికాలంలో మండే వేడి జుట్టు నుండి తేమను తీసివేస్తుందని, దానితో జుట్టు పొడిగా, నిస్తేజంగా నిర్వహణ కష్టతరంగా మారుస్తుందని పేర్కొంది. దీనిని అధిగమించేందుకు పారాచూట్ అడ్వాన్స్డ్ హెయిర్ ఆయిల్ ప్రభావంతమైన పరిష్కారం చూపుతోందని ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సీజన్‌లో జుట్టును ఆరోగ్యంగా హైడ్రేట్ గా ఉంచడానికి, సరైన పదార్థాలతో దానిని పోషించడం చాలా అవసరమని సూచించింది. వేసవి నష్టం నుంచి జుట్టును రక్షించడానికి కలబంద, కొబ్బరి ఒక ఖచ్చితమైన చక్కని కలయిక అని తెలిపింది.

ఎలైట్ ఎలివేటర్స్ పోర్టుపోలియో విస్తరణ

హైదరాబాద్ బ్యూరో : హోమ్ లిఫ్ట్ బ్రాండ్ అయినటువంటి ఎలైట్ ఎలివేటర్స్ తన ఉత్పత్తుల పోర్టుపోలియోను విస్తరించినట్లు తెలిపింది. కొత్తగా ఎక్స్300, ఎక్స్300 ప్లస్‌గృహ లిఫ్టులను ఆవిష్కరించినట్లు వెల్లడించింది. ఈ వినూత్న ఉత్పాదనలు నూతన నివాస మొబిలిటీని పెంచనున్నాయని పేర్కొంది. 2025లో అమెరికా, కెనడాలకు తమ కార్యకలాపాలను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఎలైట్ ఎలివేటర్స్ ఎండి, సిఇఒ విమల్ బాబు తెలిపారు. నివాస ఎలివేటర్ మార్కెట్ 2030 వరకు ప్రతీ ఏడాది 8-9 శాతం వృద్ధిని నమోదు చేసే అవకాశాలున్నాయన్నారు. ఈ రంగంలోని అపార అవకాశాలను అందిపుచ్చుకోవాలని నిర్దేశించుకున్నామన్నారు. ఈ ఏడాది 3000 యూనిట్లను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

పరిశ్రమల శాఖ గెజిటెడ్ అధికారుల డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పరిశ్రమల శాఖ గెజిటెడ్ అధికారుల సంఘం డైరీ 2025ను ఆ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఉపయోగపడే డైరీని అసోషియేషన్ తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మంత్రిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల డైరెక్టర్ జి.మల్సూర్, టిజిఐఐసి ఎండీ.విష్ణువర్ధన్ అదనపు డైరెక్టర్ రాజ్‌కుమార్ ఓహత్‌కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, Vellore Asokan Malarvizhi D/o. Vellore Mrugesh Asokan, R/o. 18-188, Road no.1, Mallikarjuna Nagar, Near Community Hall, Hanumanpet, Malkajgiri, K.V. Ranga Reddy, Telangana State. Pin Code: 500047. Change my name from **P. Malarvizhi** (old name) to Vellore Asokan Malarvizhi (new Name) for All purposes

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CIIITS: GUNTUR DISPUTE No. 89 of 2023

Between:-
M/s Margadarsi Chit Fund Pvt. Ltd., Station Road, Tenali .... Disputant
AND
Mr. Sk. Arif Sohil and Others ...Opponents

OPPONENT -2 Mr. Shaik Gouse Bakshi, S/o Sk. Abdulla, School Assistant(Hindi), Z P High School, Pyaparru Po., Amarthaluru Mdl., Guntur Dist

OPPONENT-3 Ms. Shaik Jarin Tara, W/o Mohd. Shakeel Ahmed, Panchayat Secretary Gr-1, Gram Panchayat, Chelamcherla Po., Kavali Mdl., SPSR Nellore Dist.

OPPONENT -4 Mr. Shaik Imran Basha, S/o Sk. Mahaboob Subhani, Sr. Engineeer, Green Mark Developers P Ltd., Plot No.26, Jubilee Enclave, Hightech City, Madhapur, Hyderabad.

Whereas the above named Disputant filed the above Dispute against you for recovery of a sum of Rs.2,65,700.00 for notice of you that you are hereby required to appear before the Deputy Registrar of Chits, Guntur on 11 - 03 - 2025 at 10.00 a.m. either personally of through an advocate and for your defence / objections. If you fail to attend the office of the DeputyRegistrar of Chits on that day the matter will be heard and decided exparty basis on the material available.

(By order of the Deputy Registrar of Chits)

B.M.S.D. PRASAD
ADVOCATE, TENALI

నోటీసు
మహారాజశ్రీ 12వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టు, విజయవాడ
ఐ.పి. నెం. 18 / 2020

బిట్వీన్ :
కుదరవల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు మరియు ఇతరులు .... వాది
అండ్
ముప్పవరపు నిర్మల లక్ష్మీ గణేష్ మరియు ఇతరులు .... ప్రతివాది

చదలవాడ ప్రణీత ఠాకూర్, భర్త : చదలవాడ జయకృష్ణ, వయస్సు 44 సం॥లు, డోర్ నెం. 2-L.H,2103, లాంకో హిల్స్ మణికొండ, గచ్చిబౌలి, కె.వి.రంగారెడ్డి జిల్లా, తెలంగాణ .... 3వ ప్రతివాది

మీరు పై దావాలో ప్రతివాది అయివున్నారు. పై దావా మీ హాజరు కొరకై ది.25-03-2025వ తేదీన వాయిదా అయివున్నది. ది. 25-03-2025న మీరు స్వయంగా కానీ, లేదా న్యాయవాది గారి ద్వారా గానీ ఉదయం 10-30 గం.లకు మహారాజశ్రీ 12వ అదనపు జిల్లాజడ్జి వారి కోర్టు, విజయవాడ నందు హాజరు కావలయును. లేనియెడల, పై పిటీషన్ మీ పరోక్షములో తీర్మానం చేయబడును. ఈ నోటీసు మహారాజశ్రీ 12వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టు, విజయవాడ వారి ఉత్తర్వుల ప్రకారం జారీ చేయటమైనది.

వాయిదాతేది : 25-03-2025
కోర్టువారి ఉత్తర్వుల మేరకు
విజయవాడ.
తేది:1-3-2025

సుంకర రాజేంద్రప్రసాద్,
న్యాయవాది, విజయవాడ.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CIIITS: GUNTUR DISPUTE No. 87 of 2023

Between:-
M/s Margadarsi Chit Fund Pvt. Ltd., Station Road, Tenali. ..... Disputant
and
M/s S S Leathers its Prop. Ms. Tirumareddy Megha Lahari and Others .... Opponents

OPPONENT -5 : Mr. Chava Sampath Kumar, S/o Adinarayana, Managaer, Staff No. 33939, Andhra Bank, Mellacheruvu Po., Suryapet Dist.

Whereas the above named Disputant filed the above Dispute against you for recovery of a sum of Rs.4,71,909.00 for notice of you that you are hereby required to appear before the Deputy Registrar of Chits, Guntur on 11-03-2025 at 10.00 a.m. either personally of through an advocate and for your defence / objections. If you fail to attend the office of the DeputyRegistrar of Chits on that day the matter will be heard and decided exparty basis on the material available.

(By order of the Deputy Registrar of Chits)

B.M.S.D. PRASAD
ADVOCATE, TENALI

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS: GUNTUR DISPUTE No. 92 of 2022

Between:-
M/s Margadarsi Chit Fund Pvt. Ltd., Station Road, Tenali ..... Disputant
and
Mr. K Suresh Babu and Others ..... Opponents

OPPONENT -1
Mr. Kothapallli Suresh Babu, S/o Rajendra Prasad, Accounts Manager, Indchem Sales Corporation, No.62, Vaibhav Apartments, EVK Sampath Road, Vepery, Chennai, Tamilnadu State,

OPPONENT-2
Mr. Matlapudi Sugnanam, S/o Joseph, Telecom Technician, Personal No. 00003000 O/o The SDE (G) Town/ BSNL, Telephone Exchange, Salipet, Tenali, Guntur Dist.

OPPONENT -5
Mr. Chilumuri Purushotham, S/o Issac, Telecom Technician, Personal No. 99502663, O/o SDE (Groups) Rural-II, BSNL Telephone Exchange, Vetapalem Po., Tsundur Mdl., Guntur Dist.

OPPONENT-6
Mr. Katevarapu Ramesh, S/o Jaya Paul, Senior Manager, (Tech), Emp. No. 416477, Union Bank of India, Regional Office, Opp: NIMS, Panjagutta, Hyderabad.

Whereas the above named Disputant filed the above Dispute against you for recovery of a sum of Rs.14,803.00 for notice of you that you are hereby required to appear before the Deputy Registrar of Chits, Guntur on 11-03 - 2025 at 10.00 a.m. either personally of through an advocate and for your defence / objections. If you fail to attend the office of the Deputy Registrar of Chits on that day the matter will be heard and decided exparty basis on the material available.

(By order of the Deputy Registrar of Chits)

B.M.S.D. PRASAD
ADVOCATE, TENALI

5 నిమిషాలు ఆలస్యమైనా అనుమతి

- రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు
- ఏర్పాట్లన్నీ పూర్తి : ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య
- కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షణ

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమవుతాయని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య చెప్పారు. ఈ పరీక్షల నిర్వహణ కోసం ఏర్పాట్లన్నీ పూర్తి చేశామని వివరించారు. ఈనెల 25 వరకు జరిగే ఈ పరీక్షలు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని అన్నారు. విద్యార్థులు ఉదయం 8.45 గంటల వరకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఉదయం తొమ్మిది తర్వాత ఐదు నిమిషాలు ఆలస్యమైనా అంటే 9.05 గంటల వరకు విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామని ఆయన స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్ నాంపల్లిలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచి 4,88,448 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 5,08,523 మంది కలిపి మొత్తం 9,96,971 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారని వివరించారు. వారి కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,532 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఇందులో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 400, ప్రభుత్వరంగ కాలేజీల్లో 242, ప్రయివేటు కాలేజీల్లో 861, స్కూళ్లు, ఇతర కాలేజీల్లో 29 ఉన్నాయని అన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడం కోసం 1,532 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 1,532 మంది డిపార్ట్మెంటల్ అధికారులు, 29,992 మంది ఇన్విజిలేటర్లు, 72 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, 124 మంది సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించామని వివరించారు. ఇంటర్ బోర్డు నుంచి పరిశీలకులను నియమించామని చెప్పారు.

హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్ ముద్రణ

ఈ ఏడాది విద్యార్థుల హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్‌ను ముద్రించామని కృష్ణ ఆదిత్య చెప్పారు. పరీక్షా కేంద్రం ఎక్కడుందో, ఇంటి నుంచి అక్కడికి చేరుకోవడానికి ఎంత సమయం పడుతుందో తెలుసుకోవడానికి వీలవుతుందని అన్నారు. విద్యార్థులు ఒకరోజు ముందే పరీక్షా కేంద్రాన్ని సందర్శించాలని సూచించారు. ప్రశ్నాపత్రం, ప్రతి పేజీపైనా యూనిక్ సీరియల్ నెంబర్‌ను ముద్రించామని వివరించారు. ఏ ప్రశ్నాపత్రం ఏ విద్యార్థికి చేరిందో తెలుస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో జిల్లా పరీక్షల కమిటీ (డిఇసి)ని ఏర్పాటు చేశామని చెప్పారు. ఇంటర్ బోర్డులో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, పరీక్షలు, ఒత్తిడి వంటి అంశాలపై విద్యార్థులు (9240205555) ఫోన్ చేసి తెలుసుకోవచ్చని అన్నారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో వెళ్లేలా ఆర్టీసీ అధికారులతో సంప్రదించామని, ప్రత్యేక బస్సులను నడపాలని విజ్ఞప్తి చేశామని వివరించారు. పరీక్ష సమయంలో విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి పరీక్షా కేంద్రంలో ఎఎన్ఎం లేదా ఆశా అవసరమైన మందులతో అందుబాటులో ఉంటారని చెప్పారు.

చేతి గడియారాలను అనుమతించం

పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించబోమని కృష్ణ ఆదిత్య అన్నారు. స్మార్ట్ వాచ్‌లే కాకుండా సాధారణ చేతి గడియారాలను కూడా అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లో ప్రతి అరగంటకోసారి బెల్ మోగించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. టిజిపిఎస్‌సి నిబంధనలను పాటిస్తామని అన్నారు. అయితే విద్యార్థులు ష్యూ వేసుకుని రావొచ్చని సూచించారు. తరగతి గదుల్లో గోడ గడియారాలను అందుబాటులో ఉంచే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పరీక్ష కేంద్రాలను పర్యవేక్షిస్తామని అన్నారు. అందులో 75 మంది సిబ్బందిని నియమించామని వివరించారు. 45 పరీక్షా కేంద్రాలకు ఒక స్క్రీన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో ఐదు లేదా ఆరు సిసి కెమెరాలుండేలా చర్యలు చేపట్టామని చెప్పారు. తక్కువ మంది విద్యార్థులున్న కారణంగా మరాఠీ, కన్నడ ప్రశ్నాపత్రాలను ఈ పరీక్షల్లో చేతిరాతతోనే ఇస్తామని అన్నారు. రాష్ట్రంలో 19 కేంద్రాల్లో మూల్యాంకనం జరుగుతుందని, కొత్తగా వరంగల్, మెదక్‌లో ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ ఏడాది ఆఫ్‌లైన్‌లోనే మూల్యాంకనం జరుగుతుందన్నారు.

విద్యార్థులు సమస్యలను ఎదుర్కోవాలి

విద్యార్థుల ఆత్మహత్యలపై కృష్ణ ఆదిత్య స్పందించారు. ఇంటర్ పరీక్షలు ప్రారంభం కాదు, ముగింపు కాదని చెప్పారు. దీని తర్వాత డిగ్రీ, పీజీ చదవాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులకు గొప్ప భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ఎవరూ ఆందోళనకు గురికావొద్దనీ, ఒత్తిడికి లోను కావొద్దని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, ఇంటర్ బోర్డు వారి వెంట ఉందనీ, తల్లిదండ్రులు కూడా ఉంటారని అన్నారు. సమస్యలను ఎదుర్కోవాలనీ, ఆత్మవిశ్వాసంతో నిలబడాలని సూచించారు. ఏడాదిలో చదివిన మొత్తం మూడు గంటల్లో పరీక్ష రాసేటపుడు ఒత్తిడి ఉంటుందని, దాన్ని అదుపులో ఉంచుకోవాలని కోరారు. ఎన్నికల కోడ్ ముగిశాక జెఎల్ అభ్యర్థులకు నియామక పత్రాల గురించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

జిహెచ్ఎంసిలో భారీ స్కాం?

- అర్హత లేకున్నా రూ.30 నుంచి రూ.40 కోట్ల పనులు
- జిహెచ్ఎంసి కమిషనర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జిహెచ్ఎంసీలో భారీ స్కాం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఆర్‌సీ కన్‌స్ట్రక్షన్ పేరిట ఏర్పాటైన ఏజెన్సీ.. రిటైర్ అధికారి సంతకం ఫోర్జరీ చేసి నకిలీ లైసెన్స్ తీసుకుని జీహెచ్ఎంసీలో దాదాపు రూ.30 నుంచి 40 కోట్ల విలువైన పనులను దక్కించుకున్నట్టు సమాచారం. ఓ వ్యక్తి స్పెషల్ క్లాస్ లైసెన్స్‌ను సైతం నకిలీగా తయారు చేసి (ప్రస్తుతం) కోట్లాది రూపాయల పనులు చేస్తున్నాడని పలువురు కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ఇందుకుగాను కొంత మంది అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు సహకరించారని తెలిసింది. ఎస్ఆర్‌సి కన్‌స్ట్రక్షన్ పేరిట ఏర్పాటైన ఏజెన్సీ నకిలీ లైసెన్స్‌తో జిహెచ్ఎంసిలో కొద్ది సంవత్సరాలుగా పనులు దక్కించుకుంటున్నట్టు బిసి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం కమిషనర్ ఇలంబర్తికి ఫిర్యాదు చేశారు. ఈ సంస్థ ఇప్పటి వరకు జీహెచ్ఎంసీ పరిధిలో సుమారు రూ.30 కోట్ల నుంచి రూ.40 కోట్ల విలువైన పనులు చేసినట్టు బీసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధి జి.సాయికిరణ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. సదరు ఏజెన్సీ నడిపిస్తున్న వ్యక్తి ఇటీవల తాను సెకండ్ క్లాస్ పనులు చేసేందుకు కూడా అర్హుడనంటూ ఫేక్ లైసెన్స్ సృష్టించి ఇప్పటికీ జీహెచ్ఎంసీ పరిధిలో కోట్లాది రూపాయల పనులు చేస్తున్నట్టు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. రిటైర్డు అయిన అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసి, మరికొన్ని పనులకు సంబంధించిన టెండర్లను కూడా దక్కించుకున్నట్టు వారు కమిషనర్‌కు వివరించారు. బిల్లులు చెల్లించే అకౌంట్స్ విభాగంతోపాటు ఈ పనులకు అనుమతులు ఇచ్చి, బిల్లులు రాసిన అధికారుల పాత్రపైనా పూర్తి విచారణ చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన కమిషనర్ సమగ్ర విచారణ జరిపించి, తగిన చర్యలు తీసుకుంటామని వారికి హామీనిచ్చారు. ఇదిలావుండగా ఎస్ఆర్‌సీ కన్‌స్ట్రక్షన్ అనే సంస్థ ఫేక్ సంస్థ అని, అందుకు సంబంధించిన ఆధారాలతో సిఎం రేవంత్‌రెడ్డికి, చీఫ్ సెక్రటరీ శాంతికుమారితో పాటు స్టేట్ విజిలెన్స్‌కు కూడా ఫిర్యాదులు చేసినట్టు సాయికిరణ్ వివరించారు.

ఉన్నతమైన చదువులు చదువుకుని అర్హతకు తగిన ఉద్యోగం లభించక, జిహెచ్ఎంసి కాంట్రాక్టర్లు పనులు చేస్తూ, తాము జీవించటంతోపాటు ఇతరులకు కూడా ఉపాధి కల్పిస్తున్నామని బిసి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధి సాయికిరణ్ తెలిపారు. అప్పులు తెచ్చి, ఆస్తులను తనఖా పెట్టి పనులు చేసినా ఇప్పటి వరకు ఏడాది నుంచి బిల్లులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కుల మతాలకతీతంగా దేశం ఐక్యం కావాలి

- రక్షణ కోణంలో హైదరాబాద్ రెండో రాజధానిగా ఉండాలి
- ప్రకాష్ యశ్వంత్ అంబేద్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశ రక్షణ కోణంలో హైదరాబాద్ రెండో రాజధానిగా ఉండాలని అంబేద్కర్ మనవడు ప్రకాష్ యశ్వంత్ అంబేద్కర్ అన్నారు. దేశ రెండో రాజధానిగా హైదరాబాద్‌ను ఏర్పాటు చేయాలనే అంశంపై బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్ యశ్వంత్ అంబేద్కర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ రెండో రాజధానిగా ఉండాలని అంబేద్కర్ బలంగా కోరే వారన్నారు. దేశ రాజధాని ఢిల్లీ.. పాకిస్తాన్ సరిహద్దు నుంచి కేవలం 300 కిలోమీటర్ల దూరంలోనే ఉందని ప్రస్తావించారు. శత్రు దేశాలు రాజధానికంత దగ్గరగా ఉండటం దేశ రక్షణకు శ్రేయస్కరం కాదని చెప్పారు. ఎప్పుడైతే దేశంలో కులం, మతం ఆధారంగా రాజకీయాలు ప్రారంభమవుతాయో, అప్పుడు జాతీయ నాయకుడు అనే వారే ఉండరని అప్పట్లోనే అంబేద్కర్ చెప్పారని గుర్తు చేశారు. ప్రజాస్వామ్యం పట్ల తనకు పూర్తిగా నమ్మకం ఉందని, భారతదేశం బలమైన ప్రజాస్వామ్య దేశంగా ఎదగాలంటే కుల మతాలకతీతంగా ఐక్యం కావాలని చెప్పారు. అదేవిధంగా ప్రాంతాల మధ్య ఉన్న అసమానతలు తొలగిపోవాలన్నారు. ఒకే భాష.. ఒకే రాష్ట్రం అనే సూత్రం పనికిరాదన్నారు. ఒకే భాష మాట్లాడే వారందరినీ చారిత్ర ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా ఒకే రాష్ట్రంలోకి తీసుకొస్తే అసమానతలు పెరిగి అంతర్గత వైరుధ్యాలు పెరుగుతాయన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా కూడా బలపడనీయదన్నారు. అన్ని రాష్ట్రాలకూ సమన్యాయం కల్పించే విధంగా ఉండాలన్నారు. ఈ సమావేశం ద్వారా హైదరాబాద్ రెండో రాజధానిగా ఉండాలని కొందరు, మరికొందరు హైదరాబాద్ రెండో రాజధాని అయితే తెలంగాణ ఆదాయం హైదరాబాద్‌కే చెందే విధంగా ఉండాలన్న అభిప్రాయాలు తెలుసుకున్నానని అన్నారు. ఇందుకు అనుగుణంగా పరిపాలనాపరంగా ప్రజలందరి సౌలభ్యం కోసం ఈ ప్రాంతానికి నష్టం వాటిల్లకుండా, తెలంగాణ అభివృద్ధి తోడ్పాటుకు అన్ని విధాలుగా సమన్యాయం ఉండేటట్టు దేశ రెండో రాజధానిగా హైదరాబాద్ ఉండే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ వెంకటనారాయణ, రిటైర్డ్ ఐఆర్ఎస్ నరసమ్మ, అద్దంకి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాష్ యశ్వంత్ అంబేద్కర్

బిఆర్ఎస్‌తో కేంద్ర మంత్రుల లోపాయికారి ఒప్పందం

- మహేశ్ కుమార్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్‌తో లోపాయికారి ఒప్పందం చేసుకున్న కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నారని టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో గెలిచిన ఎనిమిది మంది బిజెపి ఎంపిలు ఏనాడైనా ప్రధానమంత్రి నరేంద్రమోడీని కలిసి నిధులు తీసుకొచ్చారా? అని ప్రశ్నించారు. కేంద్ర వైఖరి కారణంగానే మెట్రో పనులు నత్తనడకన సాగుతున్నాయని తెలిపారు. మూసీ ప్రక్షాళనకు కేంద్రం సహకరించడం లేదని విమర్శించారు. వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్ట్ గురించి కూడా రాజకీయాలు చేయడం సిగ్గు చేటని విమర్శించారు. ఆదిలాబాద్, భద్రాచలం, నిజామాబాద్ ఎయిర్ పోర్టులు పెండింగ్‌లోనే ఉన్నాయని గుర్తుచేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం సహకరించలేదని బిజెపి కేంద్ర మంత్రులే చెబుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రానికి అన్ని విధాల సహకరిస్తున్నా వారే రాజకీయాలు చేస్తున్నారన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి బిసిని తొలగించి అగ్రవర్ణాల వారికి ఇచ్చినప్పుడు ఎంపి రఘునందన్ రావు ఎందుకు మౌనంగా ఉన్నారని మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. కల్వకుంట్ల కవిత పింక్ బుక్‌లో బిఆర్ఎస్ నేతల స్కాంల గురించి రాయాలని సూచించారు. ముస్లీములు, క్రిస్టియన్ మైనార్టీ వర్గాల మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ, పెట్రోల్ బంకుల కేటాయింపు, పాఠశాలలు, హాస్టళ్ల యూనిఫాంలు కుట్టు పని మహిళలకే అప్పగింత, ఆడబిడ్డల పేరు మీద 4.50 లక్షల మంది పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం కవితకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం ఇష్టం లేక కవిత ఉద్యమబాట పట్టారా? అని నిలదీశారు.

సమావేశంలో మాట్లాడుతున్న చామల కిరణ్ కుమార్ రెడ్డి

హరీశ్ రావు దుబాయ్ ఎందుకెళ్లారు?

- భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే దుబాయ్‌కు ఎందుకు వెళ్లారు? మార్చి 6న స్నేహితుడి ఇంట వివాహముంటే ఫిబ్రవరి 22న ఎవరి పెళ్లిలో బ్యాండ్ కొట్టడానికి వెళ్లారు? ప్రతి విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసే హరీశ్‌రావు దుబాయ్ పర్యటన వివరాలు ఎందుకు పోస్ట్ చేయలేదు? అంటూ భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. హరీశ్ రావు దుబాయ్ వెళ్లిన రోజే నిర్మాత కేదార్ మరణించారని గుర్తుచేశారు. ఈ మరణంపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో దర్యాప్తు చేయించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని డిమాండ్ చేశారు. రాజకీయ నాయకులు నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకునేందుకే దుబాయ్ వెళ్తుంటారనీ, హరీశ్ రావు లూటీ చేసిన డబ్బులు దాచుకునేందుకే వెళ్లారని ఆరోపించారు. హరీశ్ రావుకు శవ రాజకీయాలు కొత్త కాదనీ, ఎలక్షన్లు, కలక్షన్లు హరీశ్ రావు నినాదమని విమర్శించారు. ఆయన డిక్షనరీలో మొదటి పదాలు అగ్గిపెట్టె, రాజీనామాలేనని ఎద్దేవా చేశారు.

అధికారికంగా భక్త రామదాసు జయంతి ఉత్సవాలు

- ఉప ముఖ్యమంత్రి భట్టి

ప్రజాశక్తి కల్చరల్

ఇకపై ప్రతి సంవత్సరం అధికారికం గా తెలంగాణ కు చెందిన ప్రసిద్ధ వాగ్గేయకారుడు భద్రాచల శ్రీ రామ భక్తుడు రామదాసు గా ఖ్యాతి గాంచిన కంచర్ల గోపన్న జయంతి ఉత్సవాలు నిర్వహిస్తామని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. కళా కారులు పట్ల ప్రజా ప్రభుత్వం గౌరవం తో వుందని సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య వినతి మేర గతం లో నంది అవార్డుల వలెనే రంగస్థల కళాకారులకు పోటీలు నిర్వహించి ప్రతి ఏటా అవార్డ్స్ బహుకరించేందుకు ముఖ్య మంత్రి రేవంత్ సానుకూలం గా వున్నారని ప్రకటించారు లాల్ బహదూర్ ఇండోర్ స్టేడియం లో సంగీత నాటక అకాడమీని నిర్వహణలో భక్త రామదాసు 392. వ జయంతి వేడుకలు జరిగాయి ముఖ్య అతిథిగా పాల్గొన్న భట్టి విక్రమార్క మాట్లాడుతూ భక్త రామదాసు ప్రాంతానికి చెందిన వాడిగా తాను గర్వ పడుతున్నాను అని చెప్పారు నిర్మలమైన భక్తి తో ఎన్నో కష్టాలను ఓర్చుకుని రామ దాసు గొప్ప వాగ్గేయకారునిగా చరిత్ర ప్రసిద్ధి పొందారని అయన స్ఫూర్తి నీ నేటి తరాల సంగీత కళాకారులు గ్రహించాలని కోరారు గత ప్రభుత్వం కళా కారుల పట్ల శ్రద్ధ చూపలేదని సినీ కళాకారులకి గద్దర్ అవార్డ్స్ ఇవ్వబోతున్నమని తెలిపారు రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కళలు అందరికీ అబ్బవని అవి దైవ ప్రసాదితం అన్నారు సమాజ వికాసానికి అట్టి కళలను ఉపయోగించాలి అని కోరారు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ కళా కారులు ఆనందం రాష్ట్రానికి మంచి చేస్తుందని అన్నారు సంగీత నాటక అకాడమీ చైర్మన్ డాక్టర్ అలేఖ్య మాట్లాడుతూ రాష్ట్రం లోని అన్ని జిల్లాలకు చెందిన 600 మంది సంగీత కళాకారులు ఉత్సవం లో పాల్గొన్నారని తెలిపారు మే 4 న త్యాగరాజ స్వామి వేడుక కూడా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని ప్రకటించారు సంగీత గాన వాయిద్య గోష్ఠి పది గంటల పాటు నిర్విరామం గా సాగింది గోష్ఠి లో విఖ్యాతులు ఎల్ల వెంకటేశ్వర రావు శోభా రాజ్, ఉమా మహేశ్వరి డాక్టర్ రాఘవాచార్యులు కోవెల శాంత హరిప్రియ ప్రేమ రామ మూర్తి జయప్రద రామ మూర్తి శేషులత, మంతా శ్రీనివాస్ భక్త రామ దాసు వారసుడు వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు వారిని అతిథులు సత్కరించారు సాంస్కృతిక శాఖ కార్యదర్శి స్మిత సబర్వాల్ సాంస్కృతిక సారథి చైర్మన్ గుమ్మడి వెన్నెల అకాడెమీ కార్యదర్శి వినోద కుమార్ తదితరులు పాల్గొన్నారు తొలుత ట్యాంక్ బండ్ పై వున్న భక్త రామదాసు విగ్రహం నుంచి కళాకారులు వూరేగింపు గా స్టేడియం చేరుకున్నారు

నకిలీ దంత వైద్యులపై చర్యలు తీసుకోండి

- టిడిసికి డెంటల్ స్టూడెంట్స్ అసోసియేషన్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నకిలీ దంత వైద్యులపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా డెంటల్ స్టూడెంట్స్ అసోసియేషన్, ఆల్ ఇండియా డెంటల్ సర్జన్స్ అసోసియేషన్ డిమాండ్ చేశాయి. ఈ మేరకు సోమవారం అసోసియేషన్ల ఆధ్వర్యంలో దేశవ్యాప్త పిలుపులో భాగంగా రాష్ట్రంలో తెలంగాణ డెంటల్ కౌన్సిల్ చైర్మన్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మంజూర్ మాట్లాడుతూ నకిలీ దంత వైద్యులు చేసే తప్పుడు వైద్యంతో ప్రజారోగ్యానికి ప్రమాదంతో పాటు దంత వైద్యుల వృత్తి విశ్వసనీయత కోల్పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నకిలీ సరైన స్టెరిలైజేషన్ లేకుండా చేసే ఉపయోగించే పరికరాలతో రోగులకు హెపటైటీస్ బి, సితో పాటు హెచ్ఐవి సోకే ప్రమాదముందని హెచ్చరించారు. నోటి క్యాన్సర్‌తో పాటు అనేక ఇబ్బందులు తలెత్తే అవకాశముందని తెలిపారు. సరైన రోగ నిర్ధారణ లేకుండా చేస్తున్న ప్రమాదకర ప్రొసీజర్లతో శాశ్వతంగా నష్టం కలుగుతుందన్నారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌ను ప్రతి రాష్ట్రం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

చేవెళ్ల ఎస్‌సి, ఎస్‌టి డిక్లరేషన్‌పై సిఎం మౌనం వీడాలి

- కులవివక్షపై ప్రత్యక్ష ప్రతిఘటన ఉద్యమాలు
- 8న మహిళా దినోత్సవ సెమినార్లు : స్కైలాబ్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా చేవెళ్ల ఎస్‌సి, ఎస్‌టి డిక్లరేషన్‌పై సిఎం రేవంత్‌రెడ్డి మౌనం వీడాలని, తక్షణమే అంబేద్కర్ అభయహస్తానికి మార్గదర్శకాలు ప్రకటించాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అరుంధతి భవన్‌లో నిర్వహించిన కెవిపిఎస్ రాష్ట్రస్థాయి సమావేశం ముగింపు సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడారు. మార్చి ఎనిమిదిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'మనువాదం, దళిత మహిళా హక్కులు' అనే అంశంపై రాష్ట్రవ్యాప్తంగా సెమినార్లు నిర్వహించనున్నట్టు చెప్పారు. మహిళలపై అణచివేత, సామూహిక లైంగికదాడులు, హింస పెరగడానికి ఆర్ఎస్ఎస్, బిజెపి విధానాలే ప్రధాన కారణమన్నారు. జోతిబాపూలే, అంబేద్కర్ జయంతులను పురస్కరించుకొని ఏప్రిల్ నెలను మహనీయుల మాసంగా ప్రకటించుకొని రాష్ట్రవ్యాప్తంగా కులవివక్ష, అంటరానితనంపై ప్రత్యక్ష ప్రతిఘటన ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఎస్‌సి కార్పొరేషన్‌ను బలోపేతం చేసే విధంగా బడ్జెట్ కేటాయింపులు ఉండాలన్నారు. గత ప్రభుత్వం దళితబంధును అవినీతి మయం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ చేవెళ్ల డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా ఏడాదికి 750 కోట్ల రూపాయల చొప్పున కేటాయించాలన్నారు.

దళితులకు అసైన్డ్ చేయబడిన భూములకు సత్వరమే పట్టాలు ఇవ్వాలన్నారు. రైతుబంధు, రైతు బీమాను అసైన్డ్ భూమి హక్కుదారులకు వర్తింపజేయాలని కోరారు. కౌలు రైతులకూ రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్ల అద్దె భవనాలకు కిరాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచిన ప్రభుత్వం వాటిని విడుదల చేయడం లేదన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న దంపతులకు ఏళ్ల తరబడి పెండింగ్ ఉన్న ప్రభుత్వ ప్రోత్సాహకాలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల బాధితులకు అందాల్సిన ఎక్స్‌గ్రేషియో కూడా పెండింగ్‌లో ఉండటం విచారకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దళితుల కోసం ప్రకటించిన ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

కేంద్రంలోని బిజెపి సర్కార్ రాజ్యాంగం రద్దుకు పరోక్షంగా కుట్రలు చేస్తోందన్నారు. రాష్ట్రంలోనూ మతోన్మాద మూక దాడులు, కుల దురహంకార హత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని అరికట్టడానికి కులాంతర వివాహితుల రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు నాగార్జున, అతిమెల మాణిక్యం అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.అడివయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం కురుమయ్య, నందిపాటి మనోహర్, ఆరూరికుమార్ డి రాధాకృష్ణ ఎం ప్రకాశ్‌కరత్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు టి సురేష్, మంద సంపత్, డి దినకర్, డి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న స్కైలాబ్ బాబు

టెన్త్ క్లాస్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- తోటి విద్యార్థుల ఎదుట అవమానకరంగా మాట్లాడిన వైస్ ప్రిన్సిపల్
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన
- స్కూల్ ఎదుట నిరసనకు దిగిన విద్యార్థిని తల్లిదండ్రులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టీచర్ అవమానిచారని మనస్తాపంతో ఓ విద్యార్థిని హాస్టల్ బిల్డింగ్ మొదటి అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం కొత్లాపూర్ గ్రామానికి చెందిన ముక్కగల్ల తబితా జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కొత్తగడి హాస్టల్‌లో 10వ తరగతి చదువుతుంది. ఈ సందర్భంగా బాధితురాలు మీడియాతో మాట్లాడుతూ.. పెద్దయ్యాక వెటర్నరీ డాక్టర్ అవ్వాలని అనుకున్నానని చెప్పగా, అందుకు స్రవంతి టీచర్ 'నీ మొహానికి డాక్టర్ అవుతావా.. ఏదో మెడికల్ షాప్ పెట్టుకుని బతుకు' అని చిన్నతనంగా మాట్లాడి అందరి ముందు అవమానించినట్టు చెప్పింది. ఈ కారణంగానే బతుకుపైన విరక్తి కలగడంతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుని ఫిబ్రవరి 24న హాస్టల్ బిల్డింగ్ మొదటి అంతస్తు పైనుంచి దూకినట్టు వాపోయింది. ఇన్ని రోజులు సంగారెడ్డిలోని ప్రయివేటు ఆస్పత్రిలో తమ కూతురికి చికిత్స చేయించామని, పేద కుటుంబమైన తమకు రూ.1 లక్షకు పైనే ఖర్చు అయ్యాయని తల్లిదండ్రులు ముక్కగల్ల యాదయ్య, ముక్కగల్ల రాణెమ్మ కన్నీళ్లు పెట్టుకున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి తమ కూతురు ఆత్మహత్యయత్నం చేసుకోవడానికి కారణమైన టీచర్ స్రవంతిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఆమెను వెంటనే సస్పెండ్ చేయాలని హాస్టల్ ఎదుట ధర్నాకు దిగారు. వారికి ఎబివిపి, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు మద్దతుగా నిలిచి ధర్నా చేశారు. బాధ్యులపై ఫిర్యాదు చేస్తే తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇచ్చి వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు.

విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి రోహిత్ రాజ్

14 మంది మావోయిస్టుల లొంగుబాటు

- వివరాలు వెల్లడించిన భద్రాద్రి జిల్లా ఎస్‌పి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మావోయిస్టు పార్టీకి చెందిన 14 మంది సభ్యులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయారు. సోమవారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్‌పి రోహిత్ రాజ్ మాట్లాడుతూ.. 81 బెటాలియన్, 141 బెటాలియన్, సిఆర్‌పిఎఫ్ అధికారులు, ఆదివాసీ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ఆపరేషన్ చేయూతకు ఆకర్షితులై మావోయిస్టులు లొంగిపోయినట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలుసుకుని ఇకపై తామూ కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంత జీవితం గడపాలని నిర్ణయించుకొని లొంగిపోయినట్టు తెలిపారు. రెండు నెలల కాలంలో 44 మంది మావోయిస్టులు జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయారని వివరించారు.

లక్ష్యాలు ఎంచుకొని ముందుకు సాగాలి

- సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల

ప్రజాశక్తి - కల్చరల్

ఆత్మవిశ్వాసం పోటీ తత్వాన్ని పెంపొదించుకొని లక్ష్యము వైపు అడుగులు వేయాలని తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్పర్సన్ గుమ్మడి వెన్నెల అన్నారు. చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయంలో ప్రముఖ రచయిత్రి, పాత్రికేయురాలు డాక్టర్ వనిత ఆధ్వర్యంలో భాషా సంస్కృతిక శాఖ సౌజన్యలతో మూడు నెలలుగా నిర్వహించిన జానపద గేయా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డాక్టర్ వెన్నెల, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్, నగర గ్రంధాలయం చైర్మన్ ఉపేందర్ రెడ్డి లతో కలిసి విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల ఆసక్తిని తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహించాలని ఆమె సూచించారు. డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ మానవులకు మానసిక ప్రశాంతాన్ని ఆనందాన్ని ఆనందాన్ని ఇచ్చేది జానపద గేయాలు మాత్రమే అని పేర్కొన్నారు. ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించే విధంగా తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.